## క్లుప్తంగా

### ఆరంభమైన ఇంటర్ సెకండియర్ పరీక్షలు

**రాయవరం:** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభమయ్యాయి. పరీక్షా కేంద్రంలో తెలుగు 28 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా, 23 మంది హాజరయ్యారు. ఐదుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. అలాగే 96 మంది విద్యార్థులు సంస్కృతం పరీక్షలు రాయాల్సి ఉండగా, 96 మంది పరీక్షలకు హాజరయ్యారు. పరీక్షా కేంద్రానికి డీవీవీ నాగేశ్వరరెడ్డి చీఫ్ సూపరింటెండెంట్‌గా వ్యవహరించారు.

### నలుగురు గైర్హాజరు

**కాజులూరు:** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ప్రారంభమైన ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు నలుగురు విద్యార్థులు గైర్హాజరైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎస్ శ్రీనివాస్ విలేకరులకు తెలిపారు. ఈ ఏడాది కాజులూరు పరీక్ష కేంద్రంలో స్థానిక కళాశాల విద్యార్థులతో పాటు గొల్లపాలెం కాకతీయ కళాశాల, పీఎస్ఎన్ మూర్తి కళాశాలకు చెందిన మొత్తం 559 మంది ఇంటర్ విద్యార్థులు ఇక్కడ పరీక్షలు రాస్తున్నారు. ఇందులో ద్వితీయ సంవత్సరం 244 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 240 మంది హాజరయ్యారన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయన్నారు.

### కావమ్మ ఆలయం ప్రారంభం

**రామచంద్రపురం రూరల్:** మండలంలోని ద్రాక్షారామ బెస్తపేటలో మాకం వారి ఇలవేల్పు కావమ్మ నూతన ఆలయం శనివారం శాస్త్రోక్తంగా ప్రారంభించారు. కావమ్మ, మారెయ్య విగ్రహాలను ప్రతిష్ఠించారు. మాకం కామేశ్వరరావు, పద్మావతి, మాకం శివ, విజయలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, సర్పంచ్ కొత్తపల్లి అరుణ, మాజీ సర్పంచ్ యాట్ల అప్పారావు, గ్రామ పెద్దలు కోటిపల్లి అబ్బు, కర్రి వెంకటేశ్వరరావు(అబ్బు), నరాల ఏడుకొండలు, నామా వెంకన్నబాబు, ఉమ్మడి గోదావరి జిల్లాల నుంచి పెద్ద ఎత్తున మాకం వంశస్తులు పాల్గొన్నారు.

### ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ బైక్ ర్యాలీ

**రామచంద్రపురం రూరల్:** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ రామచంద్రపురం మండల రెవెన్యూ అధికారులు తహసీల్దార్ మైలా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. రామచంద్రపురం ఆర్డీఓ కార్యాలయం వద్ద ఆర్డీఓ ఎస్.సుధాసాగర్ ఈ ర్యాలీని ప్రారంభించారు. అనంతరం ర్యాలీ ద్రాక్షారామ బోసుబొమ్మ సెంటర్ వరకు కొనసాగింది. ఓటు హక్కు-జన్మహక్కు, ప్రతి ఒక్కరూ ఓటు హక్కు ఉపయోగించుకోవాలి-ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి, ప్రలోభాలకు లొంగకుండా నిజాయితీగా ఓటు హక్కు వినియోగించుకోవాలని అంటూ నినాదాలతో ర్యాలీ కొనసాగింది. కార్యక్రమంలో రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ కర్రి మహాలక్ష్మినాయుడు, వీఆర్‌ఓల సంఘం మండల అధ్యక్షుడు పంపన విష్ణుమూర్తి, కార్యదర్శి పిండిప్రోలు సాయిప్రతిమ, సంయుక్త కార్యదర్శి రాజమండ్రి సత్యవతి, కోశాధికారి కాకినాడ సాయిబాబు, మండలంలోని వీఆర్‌ఓలు, సర్వేయర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

### దాడిపై కేసు

**రాయవరం:** లొల్ల గ్రామంలో బాబిరెడ్డి ఇటుకల బట్టీలో జరిగిన దాడి ఘటనపై శనివారం కేసు నమోదు చేసినట్లు రాయవరం ఎస్సై జి.నరేష్ తెలిపారు. రామచంద్రపురం మండలం ఉట్రుమిల్లి గ్రామానికి చెందిన ఉండ్రాజవరపు వెంకటేశ్వర్లుపై ఉండ్రాచాలపు నిత్యానందం దాడి చేశాడు. చిన్నపాటి విషయానికి నిత్యానందం ఫిర్యాది వెంకటేశ్వర్లును కర్రతో కొట్టి కాళ్లతో తన్ని, చేతులతో కొట్టగా, వెంకటేశ్వర్లు భార్య అడ్డురాగా ఆమెను కూడా కొట్టినట్టుగా వెంకటేశ్వర్లు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై నరేష్ తెలిపారు.

### బాకీ అడిగినందుకు దాడి

**రాయవరం:** మాచవరం ఆదిరెడ్డి ఇటుకుల బట్టీలో జరిగిన దాడి ఘటనపై శనివారం కేసు నమోదు చేసినట్లు రాయవరం ఎస్సై జి.నరేష్ తెలిపారు. ఎస్సై నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మాచవరం గ్రామానికి చెందిన రేకులబండ దుర్గాప్రసాద్ అదే గ్రామానికి చెందిన చొల్లంగి వీరబాబుకు రూ.2వేల అప్పు ఇచ్చాడు. తనకు ఇవ్వాల్సిన బాకీ ఇవ్వమని వీరబాబును అడగ్గా డబ్బులు ఇచ్చేది లేదంటూ దుర్గాప్రసాద్‌ను ఇనుప ఊచతో కొట్టి గాయపరిచాడు. దుర్గాప్రసాద్‌ను రామచంద్రపురం ఆస్పత్రిలో చేర్పించారు. ఆసుపత్రి నుంచి సమాచారం మేరకు కేసు దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై నరేష్ తెలిపారు.

### బైక్ ఢీకొని సైక్లిస్టుకు గాయాలు

**అయినవిల్లి:** మండలంలోని ఓ మోటార్ సైక్లిస్ట్ అతి వేగంగా వచ్చి సైక్లిస్టును ఢీ కొనడంతో అతనికి తీవ్రగాయాలైన ఘటన శనివారం చోటు చేసుకుంది. దీనికి సంబంధించి స్థానిక ఎస్సై బి.రాజేష్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అయినవిల్లి మండలం విలస గ్రామం సాయిబాబా ఆలయం వద్ద అదే గ్రామానికి చెందిన దాసరి సూర్యనారాయణ సైకిల్‌పై వెళ్తున్నాడు. వీరవల్లిపాలెం నుంచి అమలాపురం వైపు బైక్ అతి వేగంగా వచ్చి సైకిల్‌పై వెళ్తున్న దాసరి సూర్యనారాయణను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో సూర్యనారాయణకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గాయపడిన సూర్యనారాయణను వైద్యం నిమిత్తం అమలాపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. బాధితుడు సూర్యనారాయణ ఫిర్యా దు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# నిండు జీవితానికి రెండు చుక్కలు

- పిల్లలకు తప్పనిసరిగా వేయించాలి
- రెండు నియోజకవర్గాల్లో 44,734 మంది చిన్నారుల లక్ష్యం
- 18 పీహెచ్‌సీల పరిధిలో 277 బూత్‌ల ఏర్పాటు
- 2,593 వెయిల్స్ క్షేత్రస్థాయికి తరలింపు
- నేడు పోలియో చుక్కల కార్యక్రమం



అంగర పీహెచ్‌సీ పరిధిలో పల్స్ పోలియో కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

**కపిలేశ్వరపురం:** భావిభారతం నేటి చిన్నారుల ఆరోగ్యంపైనే ఆధారపడి ఉంటుంది. పెరుగుతున్న వైరస్‌ల తీవ్రతలను ఎదురొడ్డి మానవ శరీరం తట్టుకోవాలంటే అందుకు తగిన సన్నద్ధత అవసరం. అందులో భాగంగా పోలియో వ్యాధి వైరస్ ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు అవసరమైన పోలియో వ్యాక్సిన్‌ను చుక్కలు మందు రూపంలో చిన్నారులకు ఇచ్చే కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఐదేళ్ల లోపు చిన్నారులకు వ్యాక్సిన్ వేసేందుకు ప్రభుత్వ యంత్రాంగం సన్నద్ధమైంది. ఇప్పటికే రామచంద్రపురం సబ్ డివిజన్ పరిధిలోని క్షేత్ర స్థాయిలో చిన్నారులను గుర్తించి వారి తల్లిదండ్రులకు వ్యాక్సినేషన్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. రెండు నియోజకవర్గాల్లో వ్యాక్సినేషన్ ప్రణాళిక తీరుపై ఈ కథనం...

**కార్యక్రమ లక్ష్యమిదీ...**

పోలియో వ్యాధి నిర్మూలనే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టాయి. కార్యక్రమం అమలుకు ప్రభుత్వ యంత్రాంగం సన్నద్ధమైంది. రెండు చుక్కలు చొప్పున చిన్నారులకు ఇవ్వడంతో శరీరంలో పోలియో వైరస్ ఉధృతిని తగ్గిస్తుంది. వ్యాధి నిరోధక శక్తిని పెంచుతుంది.1995 డిసెంబర్‌లో ప్రారంభమైన పల్స్ పోలియో చుక్కల మందు కార్యక్రమం ఏటా కొనసాగుతోంది. అప్పుడే పుట్టిన శిశువు నుంచి ఐదేళ్ల చిన్నారుల వరకూ ఈ వ్యాక్సిన్ వేయించాలి. ఆ కార్యక్రమానికి కొనసాగింపుగా ప్రస్తుతం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

**రెండు నియోజకవర్గాల్లో కార్యక్రమం సాగేదిలా...**

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లోని 18 పీహెచ్‌సీల పరిధిలోని ఐదేళ్ల లోపు 44,734 మంది చిన్నారులకు వ్యాక్సిన్ వేయాల్సి ఉండడంతో 2,590 వెయిల్స్‌ను సిద్ధం చేశారు. 277 బూత్‌ల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు. రామచంద్రపురం నియోజకవర్గంలోని 9 పీహెచ్‌సీల పరిధిలో 135 బూత్‌ల్లోని 16,667 మంది చిన్నారులకు వ్యాక్సిన్ వేసేందుకు 1,059 వెయిల్స్‌ను సిద్ధం చేశారు. మండపేట నియోజకవర్గంలోని 9 పీహెచ్‌సీల పరిధిలో 142 బూత్‌ల్లోని 28,057 మంది ఐదేళ్లలోపు చిన్నారుల కోసం 1,531 వెయిల్స్‌ను సిద్ధం చేశారు.



అంబికపల్లి అగ్రహారంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న కళాశాల విద్యార్థులు, ఆరోగ్య సిబ్బంది

**మండలాల వారీగా వ్యాక్సినేషన్ ఇలా..**

రామచంద్రపురం పట్టణంలోని రెండు పీహెచ్‌సీల పరధిలో 32 బూత్‌ల ద్వారా 5,107 మంది చిన్నారులకు వ్యాక్సిన్ వేసేందుకు 324 వెయిల్స్‌ను సిద్ధం చేశారు. రామచంద్రపురం రూరల్ గ్రామాల్లోని రెండు పీహెచ్‌సీల పరిధిలోని 45 బూత్‌ల ద్వారా 5,039 మంది చిన్నారులకు వేసేందుకు 321 వెయిల్స్‌ను ఏర్పాటు చేశారు. కె.గంగవరం మండలంలోని ఐదు పీహెచ్‌సీలోని 58 బూత్‌ల పరిధిలో 6,521 మంది చిన్నారులకు వ్యాక్సిన్ వేసేందుకు 414 వెయిల్స్‌ను సిద్ధం చేశారు. కపిలేశ్వరపురం మండలంలోని మూడు పీహెచ్‌సీలకు చెందిన 33 బూత్‌ల పరిధిలోని 4,939 మంది చిన్నారుల కోసం 314 వెయిల్స్‌ను సిద్ధం చేశారు. రాయవరం మండలంలో రెండు పీహెచ్‌సీలకు చెందిన 37 బూత్‌లలోని 9,408 మంది చిన్నారుల కోసం 349 వెయిల్స్‌ను ఆయా పీహెచ్‌సీలకు తరలించారు. మండపేట పట్టణంలోని రెండు పీహెచ్‌సీల పరిధి 30 బూత్‌లలోని 4,984 మంది చిన్నారుల కోసం 317 వెయిల్స్‌ను సిద్ధం చేశారు. మండపేట రూరల్ మండలం 42 బూత్‌ల పరిధిలోని 8,736 మంది చిన్నారులు కోసం 554 వ్యాక్సిన్ వెయిల్స్‌ను సిబ్బందికి అందజేశారు.

**అవగాహన ర్యాలీ**

**రామచంద్రపురం రూరల్:** ఈ నెల 3న ఆదివారం నిర్వహించనున్న పల్స్ పోలియో విజయవంతానికి అంబికపల్లి అగ్రహారంలోని రాజారత్న కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల, వెల్ల పీహెచ్‌సీల ఆధ్వర్యంలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. 5 సంవత్సరాల లోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయాలంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎం.స్వప్న, హెల్త్ అసిస్టెంట్ టి.జ్యోతి, వీఆర్‌ఏ సత్తెన్న, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ బి.తేజ, కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.

**సమన్వయంతో వ్యాక్సినేషన్**



"చిన్నారులకు వేసేందుకు సంబంధిత వ్యాక్సిన్ వెయిల్స్‌ను సురక్షిత పద్ధతిలో పీహెచ్‌సీలకు తరలించాము. సిబ్బందికి తగిన ప్రణాళికపై సూచనలు చేశాం. క్షేత్ర స్థాయిలోని వైద్య, ఆరోగ్య సిబ్బంది ఇప్పటికే పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల వద్దకు వెళ్లి అవగాహన కల్పించారు. ప్రభుత్వ శాఖల సిబ్బంది సమన్వయంతో వ్యవహరించేలా ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చారు. గత కార్యక్రమాల అనుభవాలు మేరకు వ్యాక్సినైజేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయగలమన్న ధీమాతో ఉన్నాం."

– డాక్టర్ ఎస్.ప్రశాంతి, సబ్ డివిజనల్ ఆఫీసర్, రామచంద్రపురం డివిజన్

**పీహెచ్‌సీల వారీగా వ్యాక్సినేషన్ ప్రణాళిక ఇలా**

| పీహెచ్‌సీ | వ్యాక్సిన్ బూత్‌లు | చిన్నారులు | వలస చిన్నారులు | వెయిల్స్ కేటాయింపు |
|---|---|---|---|---|
| ఆర్పీపురం హరిజనపేట | | | | |
| అర్బన్ పీహెచ్‌సీ | 16 | 2577 | – | 164 |
| ఆర్పీపురం ముచ్చిమిల్లి | | | | |
| అర్బన్ పీహెచ్‌సీ | 16 | 2517 | 13 | 160 |
| వెల్ల | 19 | 2141 | – | 137 |
| ద్రాక్షారామ | 26 | 2878 | 20 | 184 |
| పామర్రు | 15 | 1749 | – | 114 |
| పేకేరు | 13 | 1428 | – | 91 |
| దంగేరు | 13 | 1436 | 127 | 91 |
| కుందూరు | 17 | 1731 | 50 | 118 |
| మండపేట హరిజనపేట | | | | |
| అర్బన్ పీహెచ్‌సీ | 18 | 2343 | 18 | 150 |
| మండపేట గొల్లపుంత | | | | |
| అర్బన్ పీహెచ్‌సీ | 12 | 2605 | 18 | 167 |
| డి.కేశవరం | 18 | 3243 | 83 | 206 |
| ద్వారపూడి | 24 | 5392 | 18 | 348 |
| అంగర | 11 | 2130 | 12 | 136 |
| అచ్యుతాపురం | 10 | 1282 | – | 82 |
| వాకతిప్ప | 12 | 1511 | 04 | 96 |
| మాచవరం | 21 | 2657 | 153 | 170 |
| రాయవరం | 16 | 2659 | 3939 | 179 |
| మొత్తం | 277 | 40,279 | 4455 | 2593 |

# దుష్టచతుష్టయాన్ని ఓడించడమే లక్ష్యం

- కేశవరంలో కార్యకర్తలకు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు దిశానిర్దేశం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట

**కపిలేశ్వరపురం (మండపేట):** రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజా ప్రభుత్వానికి వ్యతిరేకంగా జట్టుకట్టిన దుష్ట చతుష్టయాన్ని ఓడించే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పని చేయాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మండపేట మండలం కేశవరంలో శనివారం పార్టీ కార్యకర్తలు, గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయి నాయకులతో సమావేశమయ్యారు. ప్రజలకు అందజేస్తున్న సంక్షేమాన్ని ప్రతి ఓటరు వద్దకూ తీసుకెళ్లాలన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావిస్తూ రాష్ట్రాన్ని పాలిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమర్థతను ప్రజల్లో ఆలోచింపజేయాలన్నారు. నియోజకవర్గంలోని 43 గ్రామాల్లో తాను స్వయంగా గడప గడపకూ మన ప్రభుత్వం పేరుతో పర్యటించానని, ఆ క్రమంలో ప్రజలు నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిశీలించి రహదారులు, డ్రైయిన్లు, సామాజిక భవనాలను నిర్మించామన్న సంగతిని ప్రజలకు గుర్తు చేయాలన్నారు. సంక్షేమ పథకాలు అమలులో తలెత్తిన సాంకేతిక సమస్యలను సైతం తొలగించి ప్రతి పేదవాడికీ ప్రభుత్వ లబ్ధి అందేలా కృషి చేసిన విషయాన్ని ప్రజల్లో విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. పార్టీ అనుబంధ కమిటీల్లో ఉన్న నాయకులంతా సమన్వయం చేసుకుంటూ గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్లాలని సూచించారు. గ్రామాల వారీగా పార్టీ పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అభివృద్ధి చేయని గ్రామమంటూ ఏదీ లేదని కార్యకర్తలు చెప్పారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి మాట్లాడుతూ మండపేట పట్టణాభివృద్ధికి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు విశేషంగా కృషి చేసిన విషయాన్ని పట్టణ ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు మాట్లాడుతూ గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి కళ్ల ముందు కనిపిస్తున్నా టీడీపీ నాయకులు తప్పుడు ప్రచారం చేయడం వారి ప్రజా వ్యతిరేక వైఖరికి నిదర్శనమన్నారు. రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు మాట్లాడుతూ మెజారిటీ గ్రామాల్లో పార్టీ బలంగా ఉందని, నాయకులు, కార్యకర్తలు అకుంఠిత దీక్షతతో ప్రజలు వెంట నడవాలని సూచించారు. పార్టీ యువనేత తోట పృథ్వీరాజ్, జెడ్పీటీసీ కరుపూడి భవానీ, ఎంపీపీలు ఉండమట్ల శ్రీనివాస్, మేడిశెట్టి సత్యవేణి, నాయకులు సిరిపురపు శ్రీనివాస్, నక్కా సింహాచలం, కపిలేశ్వరపురం, రాయవరం, మండపేట మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమమే సీఎం లక్ష్యం



కుడుపూరులో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ బోస్ తదితరులు

**కె.గంగవరం:** అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ అన్నారు. మండలంలోని కుడుపూరులో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయాన్ని శనివారం శిలాఫలకం ఆవిష్కరించి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పేద ప్రజలను ఆదుకోవడానికి ఎన్ని అడ్డంకులు ఎదురైనా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. పథకాలతో పాటు గ్రామాల్లో నూతనంగా సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, ఆరోగ్య కేంద్రాల నిర్మాణం చేపట్టారన్నారు. రైతుల వద్దకే వ్యవసాయ సేవలు అందించడానికి విప్లవాత్మక నిర్ణయం తీసుకుని ఆర్బీకేలను ప్రవేశపెట్టారన్నారు. రైతులకు ఈ కేంద్రాల ద్వారా అన్ని సేవలు అందించడంతో పాటు వ్యవసాయంలో సూచనలు, సలహాలు ఇస్తున్నారన్నారు. నేటి నుంచి గ్రామంలో నూతనంగా నిర్మించి సచివాలయం ప్రజలకు అందుబాటులో ఉంటుందని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సర్పంచ్ పిల్లి రాంబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ పంధు గోవిందరాజు, డీసీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకులు సత్తిబాబు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# టీడీపీ మోసగించినా.. వైఎస్సార్ సీపీ న్యాయం చేస్తుంది

**ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు**



కుర్రావారిమెట్ట వద్ద లబ్ధిదారులతో ఎమ్మెల్సీ తోట

**కపిలేశ్వరపురం (మండపేట):** కేశవరం గ్రామ శివారు కుర్రావారి మెట్టలో గతంలో ఇళ్ల పట్టాలను ఇచ్చి స్థలాలను కేటాయించకుండా టీడీపీ మోసగించిన వారికి ప్రస్తుత వైఎస్సార్ సీపీలో న్యాయం జరుగుతుందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు హామీ ఇచ్చారు. కుర్రావారిమెట్టను శనివారం సందర్శించి గతంలో పట్టాలు పొందిన వారితో సమావేశమయ్యారు. చేతిలో పట్టాలు పెట్టి ఏళ్లు గడచినా తమకు స్థలాలు చూపించలేదంటూ ఆనాటి లబ్ధిదారులు ఎమ్మెల్సీ తోట ఎదుట వాపోయారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ దృష్టికి కుర్రావారిమెట్ట ఇళ్ల పట్టాల సమస్యను తీసుకెళ్లానని, అక్కడి పేదలకు ఎలాంటి సమస్యలు ఎదురైనా ముందుండి న్యాయం చేయమని చెప్పారని ఎమ్మెల్సీ తోట చెప్పారు. చదును పనులను చేపట్టి స్థలాలను కేటాయించే ప్రక్రియను చేపడుతున్నామన్నారు. త్వరలో పట్టాలను అందజేస్తామన్నారు. గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్న సర్పంచ్ పెదపాటి సత్యనారాయణమూర్తి, ఎంపీపీ ఉండమట్ల శ్రీనివాస్, కూసు దొరాజీ తదితర అనేక మందిని ఎమ్మెల్సీ తోట అభినందించారు. గ్రామంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలంతా ఒక్కతాటిపై ఉంటూ ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కురుపూడి భవానీ, ఎంపీపీలు ఉండమట్ల శ్రీనివాస్, మేడిశెట్టి సత్యవేణి, సర్పంచ్ పెదపాటి సత్యనారాయణమూర్తి, ఎంపీటీసీలు అన్నందేవుల కృష్ణారావు, చంద్రమళ్ల పోతురాజు పాల్గొన్నారు.

**అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

కేశవరంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్సీ తోట శంకుస్థాపన చేశారు. శెట్టిబలిజపేటలో రూ.7లక్షలతో నిర్మించతలపెట్టిన సీసీ రహదారి నిర్మాణ పనులు, సచివాలయం-03 వద్ద స్థలం, ఎస్సీ ఏరియా పాఠశాల వద్ద స్థలం, ఎస్సీ ఏరియా పార్క్ స్థలం లెవెలింగ్ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కార్యదర్శిలు కర్రి పాపారాయుడు, దూలం వెంకన్నబాబు, రైతు విభాగంరాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాధాకృష్ణ, నాయకులు వేగుళ్ళ పట్టాభిరామయ్య చౌదరి, సర్పంచ్, ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మహనీయుల విగ్రహాల ఏర్పాటు ఐక్యతకు ప్రతీక



మండపేటలో విగ్రహాల ఏర్పాటు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్సీ తోట

**కపిలేశ్వరపురం (మండపేట):** మానవ సమాజ నిర్మాణానికి జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుల విగ్రహాలను మండపేట పట్టణంలో ఏర్పాటు చేసుకోవడం ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలు ఆ కోవలోకి వస్తాయన్నారు. వారి విగ్రహాల సెంటర్‌లో శనివారం జ్యోతీరావ్ పూలే, వంగవీటి మోహనరంగా, వీవీఎస్ఎస్ చౌదరి విగ్రహాల ఏర్పాటు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. పెద్దకాలువ వద్ద సావిత్రిబాయి పూలే విగ్రహ ఏర్పాటు కోసం శంకుస్థాపన చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాధాకృష్ణ, యువనేత తోట పృథ్వీరాజ్, వైస్‌చైర్మన్ పిల్లి గణేష్, పలు ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ విగ్రహాల ఏర్పాటు మహనీయుల చరిత్రకు సాక్ష్యంగా నిలుస్తాయన్నారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ మారుతున్న కాలంలో యువతకు మహనీయుల జీవిత త్యాగాలు తెలియాలన్నారు.

### కారు, ఆటో ఢీ : ఐదుగురికి గాయాలు

**రాయవరం:** సోమేశ్వరంలో కారు, ఆటో ఢీకొన్న ప్రమాదంలో ఐదుగురు వ్యక్తులకు గాయలయ్యాయి. రాయవరం నుంచి మాచవరం వైపు వెళ్తున్న ఆటో, మాచవరం నుంచి సోమేశ్వరం వైపునకు వస్తున్న కారు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో ఆటో డ్రైవర్‌తో సహా ముగ్గురు ప్రయాణికులకు, మోటార్ సైకిల్‌పై ఉన్న ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. గాయపడ్డ ఐదుగురు వ్యక్తులను రామచంద్రపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. గాయపడ్డ సబ్బెళ్ల కాంచన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు.

# ఈవీఎంలపై అవగాహన

**మలికిపురం:** రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈవీఎంలపై అవగాహన, శిక్షణ కార్యక్రమం శనివారం స్థానిక ఎంవీఎన్ జేఎస్ అండ్ ఆర్వీఆర్ డిగ్రీ కళాశాల ఆవరణలో జరిగింది. తహసీల్దారు జి.అనిత కుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మండలంలోని మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈవీఎంలపై పూర్తి స్థాయి అవగాహన కల్పించుకోవాలన్నారు. ఎంపీడీఓ ముత్యం వీరా స్వామినాయుడు, ఎంఈఓ ఎం. విజయశ్రీ, వీఆర్‌ఓ హరికిషన్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**రాజోలు:** ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్(ఈవీఎం)ల అనుసంధాన ప్రక్రియలపై మహిళా ఉద్యోగులకు శనివారం శిక్షణ ఇచ్చారు. స్థానిక బాలికోన్నత పాఠశాలలో తహసీల్దార్ కె.గోపాలకృష్ణ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు, శిక్షణ నిర్వహించారు. మాస్టర్ ట్రైనీలు ఉండవల్లి శ్రీనివాస్, అడబాల కాశీ విశ్వేశ్వరరావు, గెల్లి విశ్వనాథ గుప్త, గటిగంటి శ్రీనివాస్‌లు ఓటు వేసే సమయంలో వినియోగించే వీవీప్యాడ్, బ్యాలెట్ యూనిట్, ఓటింగ్ యూనిట్‌ల పనితీరుపై అవగాహన కల్పించారు. ఈ మూడు యూనిట్స్‌ను అనుసంధానం చేసే ప్రక్రియపై మహిళా ఉద్యోగులకు శిక్షణ ఇచ్చారు. ఈవీఎంలపై ఎన్నికల విధులను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఉద్యోగికి శిక్షణ ఇస్తున్నామని తహసీల్దారు గోపాలకృష్ణ తెలిపారు. ఎంఈఓ మనోహరం, డిప్యూటీ తహసీల్దారు ఎస్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

### పేకాడుతున్న ఐదుగురి అరెస్టు

**రాయవరం:** గ్రామ పరిధిలో శనివారం పేకాట శిబిరంపై దాడి చేసి, ఐదుగురిని అరెస్టు చేసినట్టు ఎస్సై జి.నరేష్ తెలిపారు. గ్రామ శివారు పంట చేలల్లో పేకాట ఆడుతున్నట్లుగా వచ్చిన సమాచారంతో సిబ్బందితో వెళ్లి దాడి చేయగా ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.3,400 నగదును స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.



# సమన్వయంతో మహాశివరాత్రిని విజయవంతం చేయాలి

**ఆర్డీఓ సుధాసాగర్**



శివరాత్రి ఏర్పాట్లపై సమీక్ష నిర్వహిస్తున్న ఆర్డీఓ సుధాసాగర్

**కె.గంగవరం:** మహాశివరాత్రి ఉత్సవాల్లో తమకు అప్పగించిన పనిని బాధ్యతగా విధులు నిర్వహించి సమన్వయంతో పనిచేసి మహాశివరాత్రి ఉత్సవాన్ని విజయవంతం చేయాలని రామచంద్రపురం ఆర్డీఓ సుధాసాగర్ అన్నారు. మండలంలోని కోటిపల్లిలో కొలువైన ఛాయా సోమేశ్వర స్వామి ఆలయం వద్ద మార్చి 8న జరగబోయే మహాశివరాత్రిలో భక్తుల కోసం ప్రభుత్వం తరపున అధికారులు చేసే ఏర్పాట్లపై శనివారం సమీక్ష నిర్వహించారు. తొలుత ఉత్సవ కమిటీ చైర్మన్, రామచంద్రపురం ఆర్డీఓ సుధాసాగర్ శాఖల వారీగా ఏర్పాట్లపై రివ్యూ నిర్వహించారు. ఆర్టీసీ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, పోలీస్ శాఖ, రెవెన్యూ తదితర అధికారులు భక్తుల కోసం చేసే ఏర్పాట్లను ఆర్డీఓ సుధాసాగర్‌కు వివరించారు. ఆయన మాట్లాడుతూ ఏటా మహాశివరాత్రిన జిల్లాతో పాటు పలు ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో భక్తులు కోటిపల్లి గ్రామానికి తరలివస్తారని పూర్తి స్థాయిలో అధికారులు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆర్టీసీ అధికారులు చెప్పే విధంగా 50 అదనపు బస్సులను నడపాలని వాటిని రాజమండ్రి, కాకినాడ, రావులపాలెం, రామచంద్రపురం, యానం తదితర ప్రాంతాల నుంచి కోటిపల్లి గ్రామానికి బస్సులు వచ్చేలా ఏర్పాటు చేయాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు గ్రామంలో స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రామచంద్రపురం డీఎస్పీ నాగిరెడ్డి మాట్లాడుతూ మహాశివరాత్రి రోజున ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పూర్తి స్థాయి చర్యలు చేపట్టామని సుమారు 500 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తామన్నారు. పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేస్తామని ఆలయం వద్ద కంట్రోల్ రూం ఏర్పాటు చేసి నిరంతర పర్యవేక్షిస్తామన్నారు. దీంతో పాటు ప్రతి శాఖకు చెందిన అధికారులు విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా పోలీసులకు సహకరించాలని కోరారు. అనంతరం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎంపీపీ పంపన నాగమణి, సర్పంచ్ పెమ్మాడి బేబిసత్తిబాబు, దేవదాయ ధర్మదాయ శాఖ రామచంద్రపురం డివిజన్ తనిఖీదారు బాలాజీ రాంప్రసాద్, ఆలయ ఈఓ శ్రీదేవి, సీఐ పి.దొరరాజు, ఎస్సై జానీభాషా, ట్రస్ట్ బోర్డు చైర్మన్ పిల్లి శ్రీను, గ్రామ పెద్దలు అయినవిల్లి అబ్బు, పెమ్మాడి సత్తిబాబు, బీజేపీ నాయకులు కర్రి చిట్టిబాబు, మండల స్థాయి అధికారులు, స్థానిక పెద్దలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.